డీఎస్పీ పోస్టింగ్‌ల్లో మార్పులు

కర్నూలు, ఫిబ్రవరి 13: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డీఎస్పీ పోస్టింగుల్లో కొన్ని మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆళ్లగడ్డ డీఎస్పీగా షర్ఫుద్దీన్‌ను నియమించింది. ఈయన ఏసీబీ విభాగంలో డీఎస్పీగా ఉంటూ పల్నాడు ఎస్సీ ఎస్టీ సెల్‌లో కూడా డీఎస్పీగా ఉన్నారు. అలాగే ప్రస్తుతం ఆళ్లగడ్డకు బదిలీ చేసిన సుధాకర్ రెడ్డిని ఏసీబీ విభాగానికి బదిలీ చేసి అక్కడి నుంచి చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు అటాచ్ చేశారు. అలాగే తేజేశ్వర్‌రావును చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించి తర్వాత సైబర్ క్రైమ్ ఏసీబీగా నియమించారు. అలాగే యుగంధర్‌బాబును పశ్చిమగోదావరి జిల్లా సీసీఎస్ డీఎస్పీగా నియమించి అక్కడి నుంచి ఏసీబీ విభాగానికి బదిలీ చేసింది.

ప్రాభవం పాయే..!



- ఐదేళ్లు చక్రం తిప్పిన వారి పరిస్థితి రివర్స్
- సిట్టింగ్‌లకు రాం..రాం..!
- ఇన్‌చార్జిలకు పెత్తనం
- ఆ ముగ్గురు ఎమ్మెల్యేలకు కష్టకాలం
- అసంతృప్తితో రగిలిపోతున్న వర్గీయులు



గుమ్మనూరు జయరాం

కర్నూలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆ నియోజకవర్గాల్లో మొన్నటి వరకు ఎమ్మెల్యేలదే పెత్తనం. వారి ఆజ్ఞ లేనిదే ఏ పని జరిగేది కాదు. అధికారులకైనా, పార్టీ నాయకులకైనా.. కార్యకర్తలకైనా వారి మాటే శిరోధార్యం. ఐదేళ్ల పాటు నియోజకవర్గాన్ని శాశించిన వారి పరిస్థితి నేడు తలకిందులైంది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు స్థానాల్లో తాజా ఎమ్మెల్యేలు గెలవలేరని అక్కడ సీఎం జగన్ కొత్తగా ఇన్‌చార్జిల(రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు)ను నియమించారు. మొన్నటి వరకు అన్నీతామై అధికార దర్పం ప్రదర్శించిన ఎమ్మెల్యేలను పక్కన పెట్టేశారు. పార్టీ కార్యక్రమాలే కాదు.. అధికారిక కార్యక్రమాలకు సైతం దూరంగా ఉన్నారు. ఆలూరు ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు జయరాం, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ దాదాపుగా రాజకీయంగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారనే చర్చ జరుగుతోంది.

ఇంతలో ఎంత తేడా!



ఎమ్మెల్యే సుధాకర్



ఆదిమూలపు సతీశ్

కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎమ్మెల్యేగా గెలిచాక కొన్నాళ్లు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో కలసి సమన్వయంతో వెళ్లినా ఆ తరువాత ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఎమ్మెల్యే సుధాకర్ సైతం ప్రత్యేక వర్గానికి ఏర్పాటు చేసుకొని నియోజకవర్గంలో పట్టుసాధించారు. అన్నింటా తన ఆధిపత్యం కొనసాగిస్తూ వచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే సుధాకర్ గెలవలేరని, ఆయన స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేశ్ సోదరుడు ఆదిమూలపు సతీశ్‌ను వైసీపీ ఇన్‌చార్జిగా నియమించారు. మొదటి నుంచి తనకే టికెట్ వస్తుందని ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యే సుధాకర్‌కు ఆ పార్టీ అధినేత, సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం ఎమ్మెల్యే సహా ఆయన వర్గీయులకు మింగుడు పడటం లేదు. అయితే కొత్తగా నియమితులైన వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీశ్ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో కలసి నియోజకవర్గంలో పార్టీ, ప్రైవేటు కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారు. మంగళవారం కోడూమూరు-గూడూరు రోడ్డు ఆధునికీకరణ పనులకు భూమి పూజ నిర్వహించారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీశ్ హాజరయ్యారు. సి.బెళగల్ మండలంలో రెండు రోజుల క్రితం పోలకల్లు-ముడుమాల రోడ్డు భూమి పూజ అధికారిక కార్యక్రమంలో కూడా వీరిద్దరే పాల్గొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం కొత్త అసెంబ్లీ కొలువుదీరే వరకు తాజాగా ఎమ్మెల్యేలకే పవర్ ఉంటుంది. టికెట్ ఇవ్వడం.. ఇవ్వకపోవడం వైసీపీ అధిష్టానం తీసుకునే నిర్ణయం. ఇన్‌చార్జి మారిన వెంటనే ఎమ్మెల్యేను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా దూరంగా పెట్టడం ఎంత వరకు సబబు అంటూ సుధాకర్ వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. వైరివర్గంపై ఘాటుగా విమర్శలు సంధిస్తున్నారు. ఎమ్మెల్యే సుధాకర్, కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి వర్గాలు మధ్య రాజకీయ విభేదాలు భగ్గుమంటున్నాయి.

అజ్ఞాతంలో మంత్రి గుమ్మనూరు!



విరుపాక్షి

ఆలూరు నియోజకవర్గంలో ఐదేళ్లు మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు చెప్పిందే వేదం.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. ఆ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ పరిణామాలే మారిపోయాయి. రెండు పర్యాయాలు ఎమ్మెలేగా గెలిచిన జయరాం కొన్నాళ్లుగా అనుచరులు, కార్యకర్తలకు దూరంగా రాజకీయంగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇక్కడ జయరాంకు మళ్లీ టికెట్ ఇస్తే గెలవలేరు అంటూ వైసీపీ ఇన్‌చార్జిగా చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు బి. విరుపాక్షిని సీఎం జగన్ నియమించారు. మంత్రి జయరాంను కర్నూలు ఎంపీగా పోటీ చేయమని సూచించారు. అయితే.. ఎంపీగా పోటీ చేయడానికి ఆసక్తి చూపని మంత్రి జయరాం విజయవాడ నుంచి రాగానే తన అనుచరులతో సమావేశమయ్యారు. ఎంపీ టికెట్ నా ఎడమ జేబులో పెట్టుకొని వచ్చాను.. ఆలూరు ఇన్‌చార్జిగా (విరుపాక్షికి) ఇచ్చినంత మాత్రనా పార్టీ అభ్యర్థి కాలేరు.. నామినేషన్ చివరి రోజున కూడా బీ ఫారం మరొకరికి ఇచ్చిన సంఘటనలు ఉన్నాయంటూ జగన్ నిర్ణయాన్ని పరోక్షంగా వ్యతిరేకించారు. ఆ రోజు నుంచి ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనకుండా రాజకీయంగా అజ్ఞాతంలోకి వెళ్లారు. మంత్రి హోదా ఉన్నా కూడా ఆయనను, ఆయన సోదరులకు అధికారులు, పోలీసులు కూడా ప్రాధాన్యత ఇవ్వడం లేదని సమాచారం. మరోవైపు వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన జడ్పీటీసీ సభ్యుడు బి.విరుపాక్షి గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులైన గుమ్మనూరు నారాయణ, శ్రీనివాసులు, నారాయణ స్వామిలకు జై కొట్టిన వైసీపీ మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజా ప్రతినిధులు విరుపాక్షి వర్గంలో చేరిపోయారు. ఈ పరిణామాలను మంత్రి జయరాం, ఆయన సోదరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఫోన్లు చేసి దూషిస్తున్నట్లు ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నియోజకవర్గంలో మంత్రి జయారాం, నూతన వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి వర్గాల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇద్దరి మధ్య నలిగిపోవడం కంటే రాజకీయంగా సైలెంట్‌గా ఉండడం ఉత్తమం అని కొందరు, మరికొందరు టీడీపీ వైపు చూస్తున్నారు.

బుట్టా రాకతో ఎర్రకోట పవర్‌కు చెక్!



ఎర్రకోట చెన్నకేశవరెడ్డి



బుట్టా రేణుక

ఎమ్మిగనూరు నియోజవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ బుట్టా రేణుకను సీఎం జగన్ నియమించారు. బుట్టా రాకతో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి 40 ఏళ్ల రాజకీయ అధిపత్యానికి చెక్ పడినట్లయింది. వయోభారం కారణంగా ఎమ్మెల్యే ఎర్రకోటకు, గెలవలేడని ఆయన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి సీఎం జగన్ టికెట్ నిరాకరించిన సంగతి తెలిసిందే. మొదట్లో బుట్టా రేణుక రాకను ఏ మాత్రం ఒప్పుకోని ఎమ్మెల్యే ఎర్రకోట అధిష్టానం బుజ్జగించడంతో అయిష్టంగానే ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఎర్రకోట కనుసన్నల్లోనే వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా.. తనకంటూ ఓ ప్రత్యేక వర్గాన్ని తయారు చేసుకోవడం ఎమ్మెల్యే అత్యంత సన్నిహితులకు మింగుడు పడటం లేదు. ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా మాజీ ఎంపీ బుట్టా రేణుక వైసీపీ ఇన్‌చార్జి హోదాలో ఎమ్మెల్యే ఎర్రకోట ఇంటికి వచ్చారు. నిన్న మొన్నటి వరకు తండ్రి కొడుకులకు జై కొడుతూ వారి వెంట నడిచిన పలువురు ముఖ్య నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు బుట్టా రేణుకకు జై కొట్టడం ఎమ్మెల్యే ఎర్రకోట తనయుడు జగన్మోహన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయారని, నాయకులపై తీవ్ర స్థాయిలో తీవ్ర పదజాలంతో దూషించినట్లు సమాచారం.

సారీ..మద్దతు ఇవ్వలేను..!

బుట్టా రేణుకకు తేల్చి చెప్పిన రుద్రగౌడ్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 13: ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బుట్టా రేణుకకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రగౌడ్‌ను బుట్టా రేణుక కలిసి మద్దతు కోరారు. అయితే బుట్టా రేణుకకు మద్దతు ఇవ్వలేనని ఆయన తేల్చి చెప్పారు. 'మిమ్మల్ని ఇన్‌చార్జిగా తెచ్చుకున్న వ్యక్తి మద్దతు తీసుకోండి..' అంటూ సలహా ఇచ్చారు. 'నన్ను సంప్రదించి మీకు బాధ్యతలు ఇచ్చారా..? అని ఆయన ప్రశ్నించడంతో బుట్టా రేణుక ఒక్కసారిగా ఖంగుతిన్నారు. వెంటనే తేరుకున్న ఆమె 'అన్నా.. మనసులో ఏమీ పెట్టుకోకుండా మద్దతు ఇవ్వండి..' అని కోరారు. గతంలో పలుమార్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డికి మద్దుతు ఇచ్చానన్నారు. అయితే గెలిచిన తరువాత మమ్మల్ని పక్కన పెడుతున్నారని రుద్రగౌడ్ అసహనం వ్యక్తం చేశారు. మావాళ్లకు ఒరిగిందేమి లేదన్నారు. మావాళ్లు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. 'ఇక్కడ ఒక బీసీ నాయకుడు ఉన్నాడన్న విషయాన్ని మరిచారన్నారు. నేనుకూడా పోటీలో ఉన్నా'నని చెప్పుకొచ్చారు. చివరకు ఆయన స్పందిస్తూ కుటుంబ సభ్యులు, ముఖ్య అనుచరులతో చర్చించి మాట్లాడతానని బుట్టారేణుకను ఇంటి బయటకు వరకు వచ్చి సాగనంపారు.



ఎమ్మిగనూరులో వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి మాట్లాడుతున్న మాజీ ఎంపీ, వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక

అయ్యో చిరుత



ఎమ్మిగనూరు మండలం గుడికల్ సమీపంలోని కొండలో ఉన్న చిక్కుకున్న చిరుత



చిరుతను చూసేందుకు భారీగా తరలివచ్చిన జనం

- గుడికల్ కొండల్లో ఉచ్చులో చిక్కుకున్న చిరుత
- గుర్తు తెలియని వ్యక్తులు వేసిన ఉచ్చుకు చిక్కి.. విల విల..
- ఎట్టకేలకు పట్టుకున్న అటవీశాఖ సిబ్బంది





ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 13: మేకల మంద మీదికి వేటకు వచ్చిన ఓ చిరుత పులి గుర్తు తెలియని వ్యక్తులు పన్నిన వలలో చిక్కుకపోయింది. ఈ సంఘటన ఎమ్మిగనూరు మండలం గుడికల్ కొండల్లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలో ఉన్న చెరువును ఆనుకొని ఉన్న కొండలో (పెద్దగట్టు) గ్రామానికి చెందిన ఓ మేకల కాపరి జీవాల కోసం దొడ్డిని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ దొడ్డిలో మేకల మంద ఉండటం గమనించిన చిరుత సోమవారం రాత్రి దాడి చేసి ఓ మేకను చంపింది. అక్కడి నుంచి వెళ్తుండగా సమీపంలోని ఓ రాతి గుండు కింద గుర్తు తెలియన వ్యక్తులు ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకపోయింది. మంగళవారం వేకువజామున ఆ ప్రాంతానికి వెళ్లిన గ్రామస్తులకు ఉచ్చులోపడిన చిరుత కనిపించింది. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అటవీ శాఖ అధికారులకు తెలిపారు. రూరల్ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, డీఎఫ్ఓ శివశంకర్ రెడ్డి, ఆదోని రేంజ్ ఆఫీసర్ తేజస్విని, సెక్షన్ ఆఫీసర్ మణిధర్ నాయుడు, రెవిన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుతను బంధించేందుకు రెస్క్యూ టీంకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు నుంచి రెస్క్యూ టీం సాయంత్రానికి సంఘటనా స్థలానికి చేరుకుంది. చిరుత చిక్కుకున్న ప్రాంతాన్ని వారు పరిశీలించి రెండుసార్లు అతికష్టం మీద మత్తుమందు ఇచ్చే ప్రయత్నం చేశారు. మూడోసారి ప్రయత్నం ఫలించి చిరుత మత్తులోకి జారుకుంది. వెంటనే చిరుతను దుప్పటిలోకి వేసుకొని కొండ నుంచి కిందకు దిగారు. కింద ఏర్పాటు చేసిన బోనులో వేసి తిరుపతి జూకు తరలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా డీఎఫ్ఓ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ చిరుతకు చికిత్స అందించి, దాని నడవడికను, ఆరోగ్యాన్ని బట్టి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా ఉదయం ఎప్పుడో ఉచ్చులో చిక్కుకున్న చిరుత సాయంత్రం వరకు విలవిల లాడింది. జనం పెద్ద ఎత్తున కేకలు వేస్తూ రావడంతో చిరుత గాండ్రిస్తూ బిక్కు బిక్కుమంది. గుడికల్ గ్రామ పెద్దలు వై రుద్రగౌడ్ సంఘటనా స్థలనికి వెళ్లి చిరుత ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు చిరుతను బంధించి తరలించటంతో గుడికల్ గ్రామంతోపాటు చుట్టుముట్టు గ్రామాల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ధర్మం కోసం.. దేశం కోసం..



- సంఘ్ కార్యకర్తల నిరంతర కృషి
- ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్

సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్



హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 13: హిందూ ధర్మం కోసం.. దేశం కోసం సంఘ్ కార్యకర్తలు అనునిత్యం పాటుపడుతున్నారని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ అన్నారు. సంఘ్ ద్వారా తయారైన కార్యకర్తలతోనే వికసిత భారతదేశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కర్నూలులోని ఇండస్ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్ కార్యక్రమానికి మోహన్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. సమాజ ఉన్నతిలోనే మన ఉన్నతి అనే భావనతో డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారన్నారు. ఇదే భావన నేడు దేశమంతా వ్యాపించిందన్నారు. అయితే ఈ భావన చాలామందిలో అంతర్లీనంగా ఉందని, దాన్ని బయటకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మన శ్రద్ధ నిష్టలను తగ్గించుకోకుండా, అకుంఠిత దీక్షతో పనిచేయడం ద్వారా సుఖశాంతులతో తులతూగే వికసితభారతదేశం సాధ్యమవుతుందన్నారు. శరీరం, మనసు, బుద్ధిని ఏకీకృతం చేసి సాధన చేయాలని, సత్య న్యాయ సమ్మిళితమైన మార్గంలో ధైర్యంగా నడవాలని కార్యకర్తలను ఆయన కోరారు. విద్యార్థులు, యువకులు, పెద్దలకు ఉన్న సంఘం శాఖల ద్వారా బస్తీల వికాసం జరగాలని, సమాజహితం కోసం స్వయం సేవకులు పనిచేయాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 50 బస్తీల నుంచి 1,287 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ క్షేత్ర సంఘచాలక్ నాగరాజు, ప్రాంత సంఘచాలక్ శ్రీహరి కుమార్ రెడ్డి, విభాగ్ సంఘచాలక్ నీలకంఠ, జిల్లా సంఘచాలక్ ఎన్‌వీఎస్ గుప్త, నగర సంఘచాలక్ చల్లా వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు తక్కువ.. ఫీజులు ఎక్కువ

- ఇదీ ఏపీ టెట్ దుస్థితి
- దరఖాస్తులకు ఫీజు పెంపు
- 2022తో పోలిస్తే పేపర్‌కు రూ.250 అదనం
- ఎస్సీ, ఎస్టీలకు మినహాయింపు లేదు





నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 13: టెట్ కు దరఖాస్తు చేసుకోవడమంటే మాటలు కాదు. పరీక్షలో పోటీ పడటం సంగతి అటుంచి, దరఖాస్తు చేసుకోవాలంటే ఫీజు కట్టడానికే యాతన పడాలి. డీఎస్సీ 2024కై ప్రభుత్వం టెట్ ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతుతున్నారు. అయితే పెంచిన ఫీజు పేద అభ్యర్థులకు కష్టంగా మారింది. అధికారంలోకి రాగానే 23వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి మాట ఇచ్చి మడమ తిప్పారని నిరుద్యోగులు ఆరోపిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఎన్నికల వాతావరణం రాగానే ఎట్లాగైనా ఈసారీ ఎట్లు దండుకోడానికి వైసీపీ ప్రభుత్వం టెట్ ప్రకటన చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2022లో చివరిసారిగా వైసీపీ ప్రభుత్వం ఏపీ టెట్ నిర్వహించింది. అప్పట్లో పేపర్‌కు రూ.500 చొప్పున వసూలు చేశారు. తాజాగా ఇప్పుడు ఒక్కొక్క పేపర్‌కు రూ.750 ఫీజు నిర్ణయించారు. నిరుద్యోగభారంతో బతుకీడుస్తున్న తాము ఇంత ఫీజులు కట్టి దరఖాస్తు ఎటా చేసుకోవాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఎస్సీ, ఎస్టీలు, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు.



ఇంత ఫీజులు కట్టి.. పుస్తకాలు కొని..

టెట్‌తోపాటు డీఎస్సీకి సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాల కోసం రూ.5వేల నుంచి రూ.7వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు శిక్షణ ఇచ్చేలా స్టడీ సర్కిళ్లు ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో అవి కనుమరుగయ్యాయి. స్వంతంగా అభ్యర్థులు పరీక్షకు సిద్ధమవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫీజుల కోసం, పుస్తకాల కొనుగోళ్ల కోసం అప్పులు చేసి తిప్పలుపడాల్సి వస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులో టెట్, డీఎస్సీ పరీక్షలు తక్కువ సమయంలోనే ప్రభుత్వం నిర్వహిస్తుండటంతో ఆ సమయంలో బండెడు సిలబస్‌ను ఎలా పూర్తిచేయాలని తల పట్టుకుంటున్నారు. నాలుగున్నరేళ్ల సమయాన్ని ప్రభుత్వం నిరుద్యోగులకు కేటాయించకుండా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆఘమేఘాలపై అరకొర పోస్టులను భర్తీ చేయాలనుకోవడం ఏమిటని ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు

కేంద్రం టెట్ కన్నా అధికం



గత నెలలో కేంద్ర ప్రభుత్వం సి-టెట్ పరీక్ష నిర్వహించింది. ఒక్కో పేపర్‌కు కేంద్రం రూ.500 చొప్పున ఫీజు వసూలు చేసింది. రెండు పేపర్లు రాస్తే రూ.600 మాత్రమే తీసుకుంది. అదే రాష్ట్రానికి వచ్చేసరికి పేపర్‌కు రూ.750 చొప్పున ఎన్ని పేపర్లు రాయాలంటే అన్నింటికీ చెల్లించాలి. డీఎడ్, బీఈడీ, ఎంఈడీ విద్యార్హత ఉన్న వారు టెట్ మూడు పేపర్లను రాస్తారు. అదే డీఈడీ, బీఈడీ రెండు అర్హతలుంటే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పేపర్లు రాయాలి. 2018 తర్వాత డీఎస్సీ లేకపోవడంతో మూడు ఉపాధ్యాయ విద్యార్హతలు ఎక్కువ మందికి ఉన్నాయి. ఒక్కో పేపర్‌కు రూ.750చొప్పునమూడు పేపర్లకు రూ.2250, రెండు పేపర్లకు రూ.1500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో పాటు దరఖాస్తు చేసుకున్నందుకు ఇంటర్నెట్ షాపుల్లో రూ.100నుంచి రూ.200వరకు వసూలు చేస్తున్నారు. ఈ నెల 8నుంచి 17వ తేదీవరకు ఏపీ టెట్ పరీక్షకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఫీజు తగ్గాల్సిందిపోయి పెంచడమేంటని నిరుద్యోగులు మండిపడుతున్నారు. సోమవారం డీఎస్సీ ప్రకటన విడుదల అయినప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇవ్వలేదు. మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం కల్పించవచ్చని భావిస్తున్నారు. ఎంత ఫీజు అనేది ఇంకా నిర్ణయించలేదు. 2018డీఎస్సీకి హాజరైన అభ్యర్థులనుంచి రూ.500 చొప్పున డీఎస్సీ దరఖాస్తుకు ఫీజు వసూలు చేశారు.

విశ్వకర్మ యోజన దరఖాస్తులను పరిష్కరించండి

కలెక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.జి. సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారులను బలోపేతం చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పథకానికి ఉమ్మడి జిల్లాల నుంచి 1,46,284 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ (2023-24) ద్వారా 158 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 149 దరఖాస్తులను గడువులోపే పరిష్కరించామని అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల జీఎం ఎన్‌ఎస్‌ఆర్‌సీఎం ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం సోమశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, డీపీవో నాగరాజు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య



కార్తీక్ (ఫైల్)

దేవనకొండ, ఫిబ్రవరి 13 : చదువుకొని మంచిగా మెలగాలని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగి బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అలారుదిన్నెలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రవి, సోమలింగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు కార్తీక్ (14) ఆదోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గత నెల రోజుల కిందట చదువుకోనని మొండికేయడంతో హాస్టల్ నుండి రవి గ్రామానికి పిలుచుకువచ్చారు. అనంతరం దేవనకొండలో ఓ బైక్ రిపేరి షాపులో మెకానిక్ పని నేర్చుకునేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కర్నూలు ఆస్పత్రిలో కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక కిడ్నాప్...ముగ్గురు అరెస్టు

వెల్దుర్తి, ఫిబ్రవరి 13: మండలంలో బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రామళ్లకోట గ్రామంలో ఈనెల 3వతేదీ ఓ బాలికను ఉదయం 9 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన లింగమయ్య, జయరాముడు, శేఖర్ కిడ్నాప్ చేశారని అన్నారు. బాలిక నానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. నిందితులను అరెస్టుచేసి డోన్ కోర్టులో హాజరుపరచామని, కోర్టు వారిని రిమాండ్ విధించిందని తెలిపారు. బాలికను నానమ్మకు అప్పగించామని తెలిపారు.

శ్రీశైలంలో అంతరాష్ట్ర దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో నిందుతులు

శ్రీశైలం, ఫిబ్రవరి 13: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో దొంగతనాలు చేస్తున్న ఇద్దరిని సోమవారం శ్రీశైలం ముఖద్వారం వద్ద నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెల 23వ తేదీన శ్రీశైల దేవస్థానం పరిధిలోని లలితాంబికా వాణిజ్య సముదాయంలోని ఎఫ్ 3 దుకాణంలో ఈ ఇద్దరు దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందని శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపారు. మాచర్లకు చెందిన హరిబాబు, శంకర్ దేవస్థానం పరిధిలోని డార్మిటరరీలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వీరిపై మాచర్ల, రెంటచింతల, చిలకలూరిపేట, తెలంగాణలో పలు కేసులు నమోదయినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి వీరిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

కర్నూలు, ఫిబ్రవరి 13: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోడుమూరు రహదారిలోని కింగ్ ప్యాలెస్ కన్వెన్షన్ హాల్లో జరిగే ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనుమడు పెళ్లి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరవుతున్నారు. ఈ మేరకు డీఐజీ విజయరావు నేతృత్వంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా నుంచి ఒక అడిషినల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 17 మంది ఎస్ఐలు, 63 మంది ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుళ్లు, 130 మంది కానిస్టేబుళ్లు, 18 మంది మహిళా పోలీసులు, 70 మంది హోంగార్డులు ఈ బందోబస్తులో పాల్గొంటారు. అలాగే ఇతర జిల్లాల నుంచి ఒక అడిషినల్ ఎస్పీ, ఐదుగురు డీఎస్పీలు, 9 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 50 మంది ఏఎస్ఐలు, 110 మంది కానిస్టేబుళ్లు, 18 మంది మహిళా పోలీసులు, 50 మంది హోంగార్డులు, మూడు స్పెషల్ పార్టీలు, 97 మంది ఏఆర్ పోలీసులు ఈ బందోబస్తులో పాల్గొంటారు.

సీమ సమస్యలను మేనిఫెస్టోల్లో పొందుపరచాలి

- కృష్ణా జలాల కేటాయింపులో వివక్షకు సమాధానం చెప్పాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా లేఖ



నంద్యాల టౌన్, ఫిబ్రవరి 13 : రాబోయే ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలలో రా యలసీమ సమస్యను చేర్చాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ సమగ్రాభివృద్ధికై రాజకీయ పార్టీలు చేపట్టాల్సిన అంశాలను కోరుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు దశరథరామిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా నంద్యాలలో సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల కేటాయింపుల్లో రాయలసీమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడం అటుంచి, పాలకులు రాయలసీమ సాగునీటి అభివృద్ధిపై అశ్రద్ధ వహించడం మరింత శోచనీయమని అన్నారు. రాయలసీమ ప్రాంతం ఇతర అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంతో సమానాభివృద్ధికి పాటు పడాల్సిన పాలకులు రాయలసీమకు కేవలం 15 శాతం బడ్జెట్ కేటాయింపులు చేసి, 85 శాతం బడ్జెట్ నిధులు కోస్తా ప్రాంతానికి కేటాయించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. పాలకుల నిర్లక్ష్యం వలన కృష్ణా నదీ జలాల నీటి కేటాయింపులలో వెనుకబడిన రాయలసీమ తీవ్ర వివక్షతకు గురవుతోందని, సాగునీటి అంశంలోనే కాకుండా అన్ని రంగాలలో రాయలసీమ పాలకుల విధానాల వల్ల పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన విమర్శించారు. రాష్ట్ర విభజన జరిగి పది సంవత్సరాలవుతున్నా విభజన చట్టంలో రాయలసీమకు కల్పించిన హక్కులను అమలు పరచడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు కేటాయించిన నీటిలో 40 శాతం కృష్ణా జలాలను వినియోగించుకోడానికి ప్రాజెక్టుల స్థిరీకరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన చట్టం అనుమతించిన తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీ -నీవా, వెలిగొండ ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేసి రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేయడమే కాకుండా, పట్టిసీమ-పోలవరం ద్వారా ఆదా అయిన 80 టీఎంసీల కృష్ణా జలాలను ఈ ప్రాజెక్టులకు నికర జలాలుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వకర్మ యోజన పథకం అమలు కమిటీ సభ్యుడిగా కాశీవిశ్వనాథ్



కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: పీఎం విశ్వకర్మ యోజన పథకం ఇంప్లిమెంటేషన్ జిల్లా కమిటీ సభ్యుడిగా భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబలి కాశీవిశ్వనాథ్ నియమితులయ్యారు. కాశీ విశ్వనాథ్ విద్యార్థి దశలో ఏబీవీపీ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పని చేశారు. అలాగే బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. భారత ప్రభుత్వం ఇచ్చినటువంటి ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన పథకానికి న్యాయం చేస్తామని కాశీ విశ్వనాథ్ తెలిపారు. తనను నియమించినందుకు బీజేపీ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలంకి రామస్వామి అభినందించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జర్నలిస్టుల ఇంటి స్థలాల మంజూరుకు సంబంధించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవో.నెం. 535లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 5 సంవత్సరాల అనుభవం కలిగిన 368 మంది అక్రిడిటేషన్ జర్నలిస్టుల జాబితా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా వచ్చిందన్నారు. ఈ జాబితాను మండల వారిగా విభజించి తహసీల్దార్లకు పంపించి వెరిఫికేషన్ చేయించామన్నారు. దరఖాస్తు చేసుకున్న విలేకరులు కోరుకున్న విధంగా మండలాల్లో, డివిజన్ కేంద్రాల్లో, కర్నూలు నగరంలో ఇళ్ల స్థళాల కోసం భూములను గుర్తించామని అన్నారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీంకు సంబంధించిన కమిటీ సభ్యులు ఆ స్థలాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కర్నూలు నగరానికి సంబంధించి రెండు చోట్ల భూమిని గుర్తించామని, తహసీల్దార్లతో కలిసి వెంటనే ఆ భూములను పరిశీలించి తమ అభిప్రాయం చెప్పాలని తెలిపారు. అనర్హులుగా గుర్తించిన జర్నలిస్టుల వెరిఫికేషన్‌కు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే డీఆర్వో సంబంధిత తహసీల్దార్‌కు తెలియజేయవచ్చునని సూచించారు. అదే విధంగా నంద్యాల జిల్లాకు సంబంధించిన 15 మంది విలేకరులు కర్నూలు జిల్లాలో పని చేస్తున్నామని, కర్నూలు నగరంలో స్థలం కావాలని కోరుతున్నారని, ఈ జాబితాను నంద్యాల డీఆర్వో కి పంపించి వెరిఫై చేయించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, సమాచార శాఖ డీడీ జయమ్మ, కమిటీ సభ్యుడు నాగిరెడ్డి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రమణీయం.. కొలనుభారతి క్షేత్రం..!



నల్లమల ప్రకృతి అందాల నడుమ కొలనుభారతి క్షేత్రం

ఆత్మకూరు/కొత్తపల్లి, ఫిబ్రవరి 13: చదువుల తల్లి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం, బీజాక్షర క్రతువులు చేపడితే త్వరగా విద్యాబుద్ధులు సిద్ధిస్తాయని హిందూవుల నమ్మకం. ఇప్పటికీ సరస్వతీ అమ్మవారిని ప్రతి ఒక్కరు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ఇంతటి మహిమ గల సరస్వతి అమ్మవారి క్షేత్రం కొత్తపల్లి మండలంలోని నల్లమల ప్రకృతి అందాలలో ఉంది. మాఘశుద్ధ పంచమి, అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కొలనుభారతి క్షేత్రంలో వసంతపంచమి వేడుకలు వైభవంగా జరుగనున్నాయి. ఈ వేడుకను పురస్కరించుకుని వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకోనున్నారు. భక్తులకు ఏలోటు రానివ్వకుండా దేవస్థానంతో పాటు ఆయాశాఖల అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. దేశంలోని మూడు ప్రధాన సరస్వతీ ఆలయాల్లో రెండో ఆలయంగా శ్రీకొలనుభారతి క్షేత్రం పేరుగాంచింది.

నేడు వసంతపంచమి వేడుకలు



మొదటగా జమ్ము కాశ్మీర్‌లోని శారదపీఠం వద్ద వెలసిన సరస్వతీ క్షేత్రం. ఆ తర్వాత మన రాష్ట్రంలోని కొలనుభారతి క్షేత్రానికే అంతటి ప్రాముఖ్యత ఉందని పురాణాలు చెబుతున్నాయి. మూడవ క్షేత్రంగా తెలంగాణ రాష్ట్రంలోని అదిలాబాద్ జిల్లాలో వున్న బాసర సరస్వతి అమ్మవారి ఆలయం గుర్తింపు దక్కించుకుంది. కాగా శారదపీఠం, కొలనుభారతి క్షేత్రంలో సరస్వతి అమ్మవారి మూలవిరాట్ ఎదుట శ్రీచక్రం ఉండటం విశేషంగా చెప్పవచ్చు. కొలనుభారతి క్షేత్రంలో వసంత పంచమి సందర్భంగా అమ్మవారికి శ్రీశైల దేవస్థానం తరపున ఆలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. తెల్లవారుజామున 5:30 గంటలకు శ్రీశైలం దేవస్థానం నుంచి అమ్మవారికి తెచ్చిన పట్టువస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు తెలిపారు.

క్షేత్రానికి ఇలా చేరుకోవాలి: నంద్యాల నుంచి 48కిమీల దూరంలో వున్న ఆత్మకూరు పట్టణానికి చేరుకోవాలి. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న శివపురం గ్రామానికి ప్రైవేట్ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. శివపురం నుంచి శివపురం చెంచుగూడేం మీదుగా ఐదు కిలోమీటర్ల అటవీమార్గంలో ప్రయాణిస్తే కొలనుభారతి క్షేత్రానికి చేరుకోవచ్చు.

వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం



కొలనుభారతి క్షేత్రంలో బుధవారం జరిగే వసంత పంచమి వేడుకలకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం. క్షేత్ర ప్రాంగణంలోని చలువ పందిళ్లు, భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లకు చర్యలు తీసుకున్నాం. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు ప్రత్యేక వేదికతో పాటు పురోహితులను అందుబాటులో ఉంచాం. వైద్య శిబిరంతో పాటు వాహనాల పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశాం

- మోహన్, కొలనుభారతి ఆలయ ఈఓ

కొలనుభారతిలో భారీ బందోబస్తు



కొలనుభారతి క్షేత్రంలో బుధవారం జరిగే వసంతపంచమి సందర్భంగా 60 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. ఇద్దరు సీఐలు, 40 మంది ఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, మహిళా పోలీసులను నియమించాం. భక్తులు సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలి. శివపురంగూడెం వద్దనే ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేయాలి. అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో భక్తులను తరలిస్తాం.

- నాగభూషణ్, సీఐ, ఆత్మకూరు రూరల్

భారతరత్న ఇస్తే సరిపోతుందా?

- చరణ్ సింగ్, స్వామినాథన్‌ల స్ఫూర్తి ఏదీ?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 13: దేశంలో అత్యధికంగా ఆధారపడిన ప్రజల వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించకుండా ఎన్నికలు సమీపిస్తున్నందు వల్ల కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి చరణ్ సింగ్‌కు డా.స్వామినాథన్‌కు భారతరత్న బిరుదులు ఇచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం పత్తికొండకు వచ్చిన రామకృష్ణ పార్టీ స్థానిక కార్యాలయంలో కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్యతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతోందని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతాంగ ఓట్లను దండుకునేందుకు మాజీ ప్రధాన మంత్రి చరణ్ సింగ్‌కు, వ్యవసాయ రంగ పరిరక్షణకు సూచనలు అందించిన డాక్టర్ స్వామినాథన్‌లకు భారతరత్నల అవార్డులు ఇస్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజాసాహేబ్, సీపీఐ సీనియర్ నాయకులు భీమలింగప్ప, ప్రజా సంఘాల నాయకులు వీరన్న, గురుదాస్, పెద్దయ్య, కారన్న, కారుమంచి, నెట్టికంటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఎటూ తేలని పత్తికొండ పంచాయితీ..!

- జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు
- ఎమ్మెల్యే శ్రీదేవికి టికెట్ ఇవ్వకండి
- అసమ్మతి నాయకుల స్పష్టం



సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే శ్రీదేవి, నాగరత్నమ్మ



జగన్‌తో మురళీధర్ రెడ్డి



పత్తికొండ, ఫిబ్రవరి 13: ఎమ్మెల్యే టికెట్ కోసం పత్తికొండ వైసీపీలో మూడు ముక్కలాట జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఈసారి తనకే టికెట్ అంటూ చెప్పుకుంటున్నారు. ఇక మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి కుమార్తె నాగరత్నమ్మ, సీనియర్ నాయకుడు పోచంరెడ్డి మురళీధర్ రెడ్డి టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో తారస్థాయికి చేరిన పత్తికొండ వైసీపీ విభేదాలు తాడేపల్లికి చేరాయి. మంగళవారం వైసీపీలోని మూడు వర్గాల నాయకులు సీఎం జగన్‌ను కలిశారు. తాడేపల్లి క్యాంపు ఆఫీసులో సీఎం జగన్ టికెట్ ఆశిస్తున్న ముగ్గురితో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఎవరూ ఏకాభిప్రాయానికి రాకపోవడంతో అభ్యర్థి ఎంపికను సీఎం జగన్ వాయిదా వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అందరి సహకారంతో గెలిచినా...

2019 ఎన్నికల్లో భర్త హత్య సానుభూతితో టికెట్ సాధించుకున్న కంగాటి శ్రీదేవి గెలుపు కోసం నాగరత్నమ్మ, ఆమె భర్త రామచంద్రారెడ్డి, పోచంరెడ్డి మురళీధర్ రెడ్డి ఎంతగానో శ్రమించారు. అందరి సహకారంతో ఎమ్మెల్యేగా నెగ్గిన శ్రీదేవి ఆ తర్వాత నియోజకవర్గంలో తన సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటూ వచ్చారు. ఇదే సమయంలో నాగరత్నమ్మ, మురళీధర్‌రెడ్డి వర్గాలను అణగదొక్కేలా ఆమె వ్యవహరించారంటూ వైసీపీలోనే కొందరు ఆరోపిస్తున్నారు. పలుమార్లు జగన్ పర్యటన సందర్భంగా మురళీధర్ రెడ్డి ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీలను తొలగించాలంటూ అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి చేయించారు. ఇక ఎమ్మెల్యే శ్రీదేవి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు వైసీపీలోని రెండు వర్గాలు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పత్తికొండలో పార్టీ పరిస్థితిని గమనించిన సీఎం జగన్ మూడు వర్గాల నాయకులను తాడేపల్లికి పిలిపించారు. వారి మధ్య సయోధ్యకు ఆయన ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. శ్రీదేవికి మళ్లీ టికెట్ ఇస్తే తాము సహకరించే ప్రసక్తే లేదని వారు సీఎం జగన్ వద్ద కుండ బద్దలు కొట్టినట్లు సమాచారం.

పొదుపు ఉద్యమస్ఫూర్తి ప్రశంసనీయం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13: పొదుపు ఉద్యమస్ఫూర్తి ప్రశంసనీయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కొనియాడారు. మంగళవారం ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి ఐక్య సంఘం ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీవో మల్లీశ్వరి, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం కమిటీలను ఏర్పాటు చేయండి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 13: పోలింగ్ కేంద్రం కమిటీల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబు రావు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కర్నూలు నగర కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ కమిటీలు పూర్తి చేయాలని, ఒక్కొక్క పోలింగ్ బూత్‌కు ఇద్దరి పేర్లు, సెల్ నెంబర్లు త్వరగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి పంపాలన్నారు.

రహదారులను అభివృద్ధి చేయండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13: రహదారులను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ కోరారు. మంగళవారం కేతవరం గ్రామంలో ఆయన మాట్లాడుతూ కేతవరం నుంచి గార్గేయపురం రోడ్డు అస్తవ్యస్తంగా మారిందని, రోడ్డును తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. కేతవరం గ్రామాన్ని 8వేల సంవత్సరాల క్రితం ఆదిమానవుడు సంచరించిన ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించిందని, అయితే.. ఇంత వరకు ఆ ప్రాంతానికి వెళ్లడానికి రోడ్డు కూడా సక్రమంగా లేదన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, మధు, శ్రీధర్, వెంకటేశ్వర్లు, నాగమ్మ, రంగస్వామి, సూర్యనారాయణ, బుగ్గరాముడు, లలితమ్మ, పద్మావతి, శేఖర్, లక్ష్మీదేవి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై అవగాహన

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: స్థానిక సీ.క్యాంపు లలిత కళా సమితిలో జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో పరీక్ష పర్వా ప్రచారంలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు పరీక్షల పట్ల ఉండే ఆందోళనలను, ఒత్తిడిని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూలు మంగళవారం తెలిపారు. నిష్ణాతులైన రిసోర్స్‌పర్సన్‌తో పరీక్షలపై తగిన సూచనలు ఇప్పిస్తారన్నారు. పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిలను, ఆందోళనలను వివిధ రకాల సమస్యలను చర్చించడం జరుగుతుందన్నారు.

ఘనంగా సరోజినీ నాయుడు జయంతి



సరోజిని నాయుడు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 13: దేశ స్వాతంత్రోద్యమంలో ప్రసిద్ధి పొందిన మహిళా ఉద్యమ నాయకురాలు, భారత కోకిల బిరుదు అందుకున్న మాజీ గవర్నర్ దివంగత సరోజినీ నాయుడు జయంతిని మంగళవారం నగరంలోని వివిధ సంస్థల ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరోజినీ నాయుడు జయంతి వేడుకల్లో గ్రంథాలయ ఆవరణలో సరోజినీ చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా, పద్మావతమ్మ, ఉద్యోగులు మగ్బుల్ బాషా, ఆర్ఎస్ రాజు, సువర్ణమ్మ పాల్గొన్నారు.

● కర్నూలు ప్రగతి సమితి ఆధ్వర్యంలో సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని సంస్థ కార్యాలయంలో సరోజినీ నాయుడు చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలు డాక్టర్ హెచ్ అక్తర్‌బాను, అసోసియేట్ ప్రొఫెసర్ (విద్య), పి. గౌతమి, సీఐ (పోలీసు), డాక్టర్ స్మితా ప్రసాద్ (దంత వైద్యురాలు), పి. నిర్మలమ్మ (న్యాయవాది, గ్రామిక మహిళా సంఘం), తులశమ్మ (మున్సిపల్ వర్కర్), రేణుకమ్మ (అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు) ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం. శ్రీహర్ష, ప్రతినిధులు శ్రీనివాసులు, హరినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

● క్లస్టర్ వర్శిటీ అనుబంధ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల్లో సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ సరోజినీ నాయుడు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. సరోజినీ నాయుడు భారత జాతికి చేసిన సేవలను ప్రిన్సిపల్, అధ్యాపకులు కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ అక్తర్ బాను, డాక్టర్ షానవాజ్, డాక్టర్ స్వప్నశ్రీ, డాక్టర్ పార్వతి, డాక్టర్ ఫామీదాబేగం పాల్గొన్నారు.

చెరుకుచర్ల బైటికి



వైసీపీకి చేసిన రాజీనామా లేఖను చూపుతున్న చెరకుచర్ల రఘురామయ్య

● వైసీపీకి నందికొట్కూరులో షాక్
● పార్టీని వీడిన రాష్ట్ర అదనపు కార్యదర్శి
● త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్న రఘురామయ్య

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13: నందికొట్కూరు నియోజకవర్గంలోని వైసీపీకి భారీ షాక్ తగిలింది. తనకు పార్టీలో గౌరవ మర్యాదలు లభించడం లేదని, తన స్నేహితుడైన ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్‌కు టిక్కెట్ కేటాయించకలేదని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచర్ల రఘురామయ్య పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. మంగళవారం కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత దగ్గరి సంబంధం ఉన్నా సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరు వల్ల పార్టీని వీడుతున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలో తాను చేర్పిన వారికి ఉన్న గౌరవం తనకు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అన్ని రకాలుగా ఆమోదయోగ్యుడైన ఆర్థర్‌కు టిక్కెట్ ఇవ్వకపోవడం వల్లే తాను పార్టీకి రాజీనామా చేశానని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి నుంచి తనకు అడుగడుగునా అవమానాలు జరిగాయని అన్నారు. టికెట్ల కేటాయింపుల్లో దళితులకు, బీసీల గొంతుకోసి వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. అభివృద్ధి పనుల గురించి నాయకులు అధికారులను సంప్రదిస్తే.. నిధులు లేవని, తామేమీ చేయలేమని వారు చెబుతున్నారని అన్నారు. అవినీతి రహిత పాలన అని చెప్పుకున్న జగన్ నాయకత్వంలో పాలన అవినీతి మయమైందన్నారు. మద్యపానాన్ని నిషేధిస్తానని చెప్పిన జగన్... నకిలీ మద్యం విధానంతో వేల మంది మరణించారని అన్నారు. త్వరలోనే తన అనుచరులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో భవిష్యత్తు

● టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గౌరు చరిత

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సంత మార్కెట్‌లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ హుశేనాపురం గ్రామానికి జడ్పీ చైర్మన్ హయాంలో గ్రామాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చి పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారనీ విమర్శించారు. గత టీడీపీ హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఓటర్లు, ప్రజలు మరోసారి మోసపోకుండా చంద్రబాబును గెలిపించాలని కోరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపడుతున్న శంఖారావం సభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు మైనార్టీ నాయకులు ఎస్.మహబూబ్ బాషా, కాపు సంఘం నాయకులు కేవీ మధు, చదువుల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, ఉప సర్పంచ్ షమీనా, నాయకులు ప్రశాంత్, రామమద్దిలేటి, కురువ లక్ష్మన్న, కురువ క్రిష్ణ, నాగరాజు, కాటినేని నారాయణ, వడ్డె నారాయణ, వెంకటరమణ, సుధాకర్‌రావు, రామగోవిందు, సుధాకర్, రాము, వేణు, బజారు, జయక్రిష్ణ, రామకోటేశ్వరరావు, మధుసూదన్‌గౌడు, విజయరాఘవరెడ్డి, అయ్యస్వామి, నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మహిళలు

31వ వార్డులో వైసీపీకి షాక్..

కల్లూరు, ఫిబ్రవరి 13: కల్లూరు అర్బన్ 31వ వార్డులో వైసీపీకి షాక్ తగిలింది. మంగళవారం పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో షరీన్‌నగర్‌కు చెందిన 20 కుటుంబాల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడు పెద్దబీచుపల్లి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి గౌరు దంపతులు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రేణుక, గంగా, బాలమ్మ, లక్ష్మీదేవి, హరిత, భాగ్యమ్మ, కళావతి, నాగమణి, లక్ష్మీహరిత, సుజాత, అనుసూయ, పూజిత, పావని, మంగమ్మ, పద్మావతి, జయమ్మ, పుష్పవతి, గోపి, వెంకటేష్, చందు, షేక్షా, ఆకాష్, దినేష్, సతీష్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, వీరేంద్రకుమార్, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి లేని పాలన అందిస్తాం: టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 13: టీడీపీని గెలిపిస్తే కర్నూలులో అవినీతి లేని పాలన అందిస్తామని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరశివారులోని అశోక్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. యువత కలల సాకారం కావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోని రావాలన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు నాయకత్వంలో కర్నూలుకు ఒక విజన్ పెట్టుకొని తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. కర్నూలు శివారులో ఉన్న ఇండస్ట్రీయల్ హబ్‌లో ఎన్నో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కియా పరిశ్రమ అనంతరపురం రూపురేఖలు మార్చేసిందన్నారు. యువత ఆలోచించి వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధినేత అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ స్టిక్కర్‌ను అందజేస్తున్న నాయకులు

టీడీపీతోనే దళితుల అభివృద్ధి

● రాష్ట్రంలోని ప్రజలందరూ తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దళిత జేఏసీ చైర్మన్ బొల్లెద్దుల రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన దళిత చైతన్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు జనసేన ఇన్‌చార్జి అర్షద్ పాల్గొన్నారు. అనంతరం వీధుల్లో తిరుగుతూ ప్రజలను కలిసి దళిత చైతన్యం కార్యక్రమం గురించి వివరించారు. టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు దేవా, గున్నా మార్కు, సుంకన్న, నాగన్న, రవి, మాధవస్వామి, రాజ్ కుమార్, బును రామయ్య, కిరణ్, మణిప్రకాష్, తదితర ముఖ్య నాయకులు, జనసేన నాయకులు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

27న ఛలో విజయవాడ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 13: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 27న ఛలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, జీవో.నెం.117ను రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్ల మీద ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, . జడ్పీ యాజమాన్యంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు రికార్డు అసిస్టెంట్లు ల్యాబ్ అసిస్టెంట్లు పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ల మీద బుధవారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం, కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్లకు మెమోరాండం, 15న మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసనలు, 17న తాలుకా కేంద్రంలో ధర్నా, 20న కలెక్టర్ కార్యాలయంలో ర్యాలీ, 21 వరకు రాష్ట్ర నాయకుల జిల్లాల పర్యటనల తర్వాత 27న ఛలో విజయవాడ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

హరిహర క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 13: నగరంలోని సంకల్‌బాగ్‌లో, తుంగభద్ర నది ఒడ్డున వెలసిన హరిహర క్షేత్రంలో శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నిత్యం వందలాది భక్తులతో క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం వేకువ జామున స్వామి, అమ్మవార్ల మూల మూర్తులకు, ఉత్సవ మూర్తులకు ఏకకాలంలో పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు, మహా మంగళహారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, హనమాన్ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కల్లే చంద్రశేఖర్ శర్మ, హెచ్‌కే రాజశేఖర్ రావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, పాల్గొన్నారు.

16న సామూహిక సూర్య నమస్కారాలు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 13: ఈనెల 16న రథసప్తమి వేడుక సందర్భంగా, టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, నగర శివారు బి. తాండ్రపాడులోని క్రైడో పాఠశాల్లో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టీటీడీ, హెచ్‌డీపీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో క్రైడో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్యా కార్తీక్, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ధర్మ ప్రచార మండలి సభ్యుడు అనంత అనిల్‌కుమార్, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఆర్డర్ కాపీ లేకుండా జీతం ఎలా ఇస్తారు?

ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 13: రద్దు అయిన డిపార్టుమెంట్ ఉద్యోగులకు జీతాలు ఎలా చెల్లిస్తారని ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రశ్నించారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. యూనివర్సిటీ నిబంధనలను తుంగలోకి తొక్కి నిధులను స్వాహా చేస్తున్నారని, దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ నాగేంద్ర, సాద్విక్, హంసవర్ధన్‌రెడ్డి, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు ఓపీడీ సేవలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 13: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సర్జికల్ అంకాలజి, మెడికల్ అంకాలజి, రేడియేషన్ అంకాలజికు ప్రత్యేకంగా ఓపీలు ఇవ్వాలని సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి ఆదేశించారు. కర్నూలు జీజీహెచ్ ధన్వంతరీ హాలులో వివిద విభాగాల హెచ్‌వోడీలతో ఆయన ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందు కోసం ఆసుపత్రి లోని ఈఎంసీ వార్డులో మెడికల్ అంకాలజికి 10 పడకల విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల వైద్యులు సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్లను రెగ్యులర్‌గా నిర్వహించాలని వైద్యులకు సంబంధించిన లీవ్ అప్లికేషన్‌లో ఎన్ని వినియోగించుకొంటున్నారో పొందుపరచాలన్నారు. ఆరోగ్యశ్రీ ప్రతి వారం ఇచ్చే టార్గెట్‌ను న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ మరింతా ఇంప్రూవ్ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి కాలేజీలో వైద్యవిద్యార్థుల తరగతి హాజరు అటెండెన్స్, విద్యాబోధనలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలి

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 13: రబీ సీజన్‌కు సంబంధించి ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. మండలంలోని వెంకటగిరి, అమడగుంట్ల గ్రామాల్లో ఆర్బీకేలను వ్యవసాయాధికారి తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పంటన మోదు జరిగిన రైతుల ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు అందే వీలుందని తెలిపారు. రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా మారెమ్మ దేవత ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న కోట్ల దంపతులు

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 13: మండలంలోని లద్దగిరిలో మంగళవారం మారెమ్మఅవ్వ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయంలో హోమం, అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. వేడుకను పురస్కరించుకుని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కోట్ల దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోట్ల నాగేశ్వరరెడ్డి, కోట్ల కవితమ్మ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ-మెయిన్స్‌లో నారాయణ ప్రభంజనం



నారాయణ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన జేఈఈ-మెయిన్స్ ఫేస్-1 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాలకు చెందిన సొహేద్ ఆలీఖాన్ (99.93 పర్సెంటైల్), బి.వేదవ్యాస్ (99.92), పి.సాకేత్ సాయి మణికంఠ (99.71), ఎస్.సాకేత్ రామ్ (99.62), సాయి అభినయ్ (99.49), ఎం.ధనుజ్ సాయి (99.16), టి.సాయినిఖిల్ రెడ్డి (98.88), ఎం.లాస్య (98.54), ప్రణిత (98.35), పికే సౌమ్య (98.30), ఎం.హారిక (98.23), జి.సర్వజిత్ (97.74), ఏ.జశ్వంత్ (97.94), టి.సువార్త (97.72), బి.శ్రావ్య (97.40), ఎం.ధినేశ్వర్ కుమార్ (97.39), బి.గౌతమ్‌సాయి (97.24), ఎం.సోహిత్‌రెడ్డి (97.21), యు.నవ్యశ్రీ (97.11 పర్సంటైల్స్)ను సాధించారు. అలాగే 99 పర్సెంటైల్ పైన 6 మంది, 98 పర్సంటేల్ పైన 11 మంది, 97 పర్సెంటైల్ పైన 19 మంది, 96 పర్సంటైల్ పైన 26 మంది, 95 పర్సెంటైల్ మంది 97 మంది, 90 పర్సంటైల్ పైన 83 మంది, 80 పర్సెంటైల్ పైన 189 మంది, 70 పర్సెంటైల్ పైన 337 మంది విద్యార్థులు అర్హత సాధించారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అందుకు సహకరించిన తల్లిదండ్రులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కళాశాల డీజీఎం గోవర్ధన్ రెడ్డి, డీన్లు అంజనేయరెడ్డి, విశ్వనాథరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, విజయమోహన్, సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జేఈఈ-మెయిన్స్‌లో శ్రీచైతన్య కళాశాల విజయభేరి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య కళాశాలల డీన్స్ బాలాజీ, సరళ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: జేఈఈ-మెయిన్స్ మొదటి సెషన్స్ ఫలితాల్లో కర్నూలు శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు వందకు వంద పర్సెంటైల్‌తో నూతన ఒరవడిని సృష్టించారనీ శ్రీచైతన్య కళాశాల ఏజీఎం మురళీకృష్ణ, డీన్స్ సరళ, బాలాజి మంగళవారం పేర్కొన్నారు. కళాశాలకు చెందిన టి.ప్రణీత్ రెడ్డి ఫిజిక్స్ విభాగంలో వందకు వంద శాతంతో అసాధారణ ప్రతిభ కనబరిచారన్నారు. 300 మార్కులకు గానూ 250 మార్కులతో (99.77 పర్సెంటైల్)ను సాధించారన్నారు. అలాగే పి.ఉమాలిఖేష్ (98.75), ఐ.కిరిటి కీర్తన్ (98.65), డి.నోయల్ (97.58) పర్సంటైల్స్‌తో అనేక ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు కేవలం కర్నూలు శ్రీచైతన్య కళాశాలకు మాత్రమే సాధ్యమని ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఏజీఎం మురళికృష్ణ, డీన్స్ సరళ, బాలాజి అభినందించారు. ఏప్రిల్‌లో జరిగే మెయిన్స్ ఫేజ్-2లో మరింత మెరుగైన ఫలితాలను సాధించగలరని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ కళాశాల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి రఘువీర్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: జేఈఈ-మెయిన్స్ ఫేజ్-1 ఫలితాల్లో ఎస్ఆర్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు ఎస్ఆర్ కాలేజీ జోనల్ ఇన్‌చార్జి టి.రఘువీర్ మంగళవారం తెలిపారు. తమ విద్యార్థులు గ్రామీణ స్థాయిలోని పాఠశాలలో చదివి మా కాలేజీలో ఇంటర్మీడియట్ కోసం జాయిన్ అయి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి టౌన్ పిల్లలతో సమానంగా రాణించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు సూరపురెడ్డి భద్రినాథ్ (98.22 పర్సెంటైల్), బత్తుల రాజేష్ (98.01), ప్రహ్లాదరెడ్డి (96.87), తేజేశ్వర్ కార్తీకేయమూర్తి (96.23) సాయితేజశ్రీ (95.9), హన్సిక (94.60) చరణ్‌తేజ్ (93.69), సాయిసృజన (92.36), జయరంగారెడ్డి (92.02) పర్సెంటైల్స్ సాధించినట్లు టి.రఘువీర్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఐఐటీ విద్యార్థి అభిజిత్‌కు అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న విద్యాసంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 13: స్థానిక వెంకటరమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థి కే.అభిజిత్‌ను విద్యాసంస్థల అధినేత ఎన్.కేశవరెడ్డి అభినందించారు. అభిజిత్ 2014లో ఐఐటీ మెడిసిన్ ఫౌండేషన్ కోర్సులో విద్యను అభ్యసించారు. అస్సాంలోని గౌహతిలో ఐఐటీ పూర్తి చేసుకుని అడోబా కంపెనీలో జాబ్ చేస్తూ అంతర్జాతీయంగా రాణిస్తున్నారు. యంగ్ ఇంజనీరింగ్ అవార్డుకు ఎన్నికై రూ.60 లక్షల క్యాష్ ప్రైజ్‌ను అభిజిత్ అందుకున్నారు. తాను ఈస్థాయికి రావడానికి ముఖ్య కారణం కేశవరెడ్డి విద్యాసంస్థలే అని అభిజిత్ వివరించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి పాఠశాలల సిబ్బం ది, అభిజిత్ తల్లిదండ్రులు నరేంద్ర, పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 13: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంటులో విజేతలుగా నిలిచిన రిడ్జ్, ఎస్‌డీఆర్, సెయింట్ జోసెఫ్, అతీనా పాఠశాలలు నిలిచాయి. గెలుపొందిన జట్లకు శ్రీనివాసగౌడు, జాఫర్ మున్నాలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నమెంటు కార్యనిర్వాహ కులు మురళి, ముస్తహీర్, వలి, ఫారూక్, సురేంద్ర, మధు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి.బెళగల్, ఫిబ్రవరి 13: మండలంలోని కొత్తకోట, శింగవరం, ఈర్లదిన్నె. ముడుమాల గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ అనుపమ పోలింగ్ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దార్ అనుపమ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ బూత్ లెవల్ అధికారులు ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాలలోని కిశోర బాలికలకు, గర్భవతులకు, బాలింతలకు అందజేసే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఈవోఆర్డీ సందీప్, పోలింగ్ అధికారులు ఉన్నారు.

'బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలి'

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 13: డ్రైవర్లను కఠినంగా శిక్షించి జైలుకు పంపే బీఎన్ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. చట్టాన్ని రద్దు చేయాలని ఈ నెల 16న చేపడుతున్న దేశవ్యాప్త రవాణ రంగ సమ్మెను పురస్కరించుకుని మంగళవారం బళ్లారి చౌరస్తా వద్ద జీపుజాతాను ప్రారంభించారు. రాధాక్రిష్ణ మాట్లాడుతూ డ్రైవర్లను తీవ్రంగా శిక్షించే భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) 2023కు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ చేపడుతున్న సమ్మెలో రవాణారంగాన్ని స్తంభింపజేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఈ కార్యక్రమంలో న్యూసిటి అధ్యక్షుడు ఆర్.నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నాయకులు ఎస్.హుస్సేన్ రఫి తదితరులు పాల్గొన్నారు.

● పారిశ్రామికరైతు గ్రామీణ, రవాణా, కార్మిక కర్షక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే భారతదేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేఉయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ పారిశ్రామికరైతు గ్రామీణ బంధు, రవాణా రంగ కార్మికుల టైర్ బంద్ పేరుతో అన్ని కార్మిక,కర్షక,ప్రజాసంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపున్వివడం జరిగిందన్నారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు సాయిబాబ, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యాదర్శి కే ప్రభాకర్, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం సమ్మె జయప్రదం కోరకు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జీపు జాతా గూడూరు చేరింది. పాతబస్టాండ్‌లో వారు మాట్లాడుతూ 16న నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యాక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు కె రాజశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వలి, మల్లి, గూడూరు మండల నాయకులు రాజు, దాసు, రమేష్, దుబ్బన్న, బాషా పాల్గొన్నారు.



జీపు జాతా ప్రారంభిస్తున్న సీఐటీయూ నాయకులు

ఈవీఎంల పనితీరుపై అవగాహన

ఆదోని, ఫిబ్రవరి 13: కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల పనితీరుపై బీఎల్‌వోలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు డీఎల్పీవో పరిపాలన అధికారి వీరభద్రప్ప అవగాహణ కల్పించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గాను విడతల వారీగా 1వ పోలింగ్ కేంద్రం నుంచి 46వ పోలింగ్ కేంద్రంలో ఉన్న బీఎల్‌వోలకు, సెక్టోరల్ ఆఫీసర్లకు ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎం యంత్రాలపై, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌ల పని తీరుపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటర్లు తడబాటుకు గురికాకుండా యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇందుకోసం డెమో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఆర్‌వో, ఎలక్షన్ ఉప తహసీల్దార్ ఈజాజ్ అహ్మద్, ఎలక్షన్ సీనియర్ సహాయకులు ఖాసీం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుగ్గలి, ఫిబ్రవరి 13: వారం రోజుల క్రితం ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోవిందు (42) మృతి చెందినట్లు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కేపీ గుడిసెలకు చెందిన గోవిందు, భార్య గుర్రమ్మతో కలిసి ఈ నెల 7వ తేదీన ద్విచక్రవాహనం పై రామలింగాయపల్లె నుంచి కేపీ గుడిసెలకు వెళ్తుండగా.. ఇసుకలో స్కిడ్ అయి వాహనం నుంచి కింద పడ్డారు. చికిత్స నిమ్మితం వీరిద్దరిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా.. గోవిందు కోలుకోలేక మృతి చెందాడు. గుర్రమ్మ చికిత్స పొందుతోందని, మృతుని కుమారుడు కార్తిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టీడీపీ ప్రజాప్రతినిధులపై చిన్న చూపు తగదు

● కరువు సహాయక చర్యల్లో ప్రభుత్వంవిఫలం

దేవనకొండ ,ఫిబ్రవరి 13: ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులపై అధికార పార్టీ నాయకులు చిన్న చూపు చూడటం తగదని వెలమకూరు సర్పంచు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో చాలా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోలేదని ఎంపీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌గౌడ్, తపాల శ్రీనివాసులు అన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రకటనలు చేసి సహాయ చర్యలు ప్రారంభించలేదని టీడీపీ సభ్యులు ,సీపీఐ ,సీపీఎం నాయకులు సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల హామీతో ఆందోళన విరమించారు. ఇన్చార్జి ఎంపీడీవో ఇద్రూస్‌బాష, హౌసింగ్ డీఈ ఆదినారాయణ పాల్గొన్నారు.

పనిచేసే నాయకుడికి పట్టాం కట్టాలి: గడ్డం



మాట్లాడుతున్న గడ్డం నారాయణరెడ్డి

నందవరం, ఫిబ్రవరి 13: పని చేసే నాయకుడికే పట్టం కట్టాలని టీడీపీ నాయకుడు ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారం కోల్పోయిన తర్వాతా పార్టీని, కార్యకర్తలను కాపాడిన వారికి ఎమ్మెల్యే సీటు ఇవ్వాలా.. లేదా సర్వే, కులాల పేరుతో మరొకరి పేరును తెరపైకి తెస్తే పార్టీ మనుగడ సాగుంతుందా అని ప్రశ్నించారు. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్న వారిని టీడీపీలోకి తెచ్చారని, మంచి వ్యక్తి అని టీడీపీ ఎంపీ సీటు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయనకే సీటు దక్కని పరిస్థితి ఉందన్నారు. ఎమ్మిగనూరులో బీసీకి, ఆదోనిలో మీనాక్షినాయుడుకు, మంత్రాలయంలో తిక్కారెడ్డికి సీటు రాదని వదంతులు వస్తుండడంతో సర్వేలు తప్పుగా ఇస్తున్నారనే కార్యకర్తల్లో ఆందోళన తెరలేపుతుంది. కార్యకర్తలకు అండగా ఉండే నాయకుడికి కాకుండా, మనీ ఉన్న నాయకులకు టికెట్లు ఇస్తే ఇక్కడ కార్యకర్తల పరిస్థితి ఎమిటని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ ఆలోచించి కష్టకాలంలో పార్టీని బుజాన వేసుకుని పని చేసిన వారికే టికెట్లు కేటాయించాలని కోరారు.

ఫెయిల్యూర్ సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు

● టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఫెయిల్యూర్ సీఎంగా చరిత్రలో నిలిచిపోతారనీ టీడీపీ మంత్రాలయం సీనియర్ నాయకులు రాఘవేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ చెబుతున్న 99 శాతం హామీల అమలు అతిపెద్ద భూటకమని అన్నారు. ఎన్నికల హామీల్లో మోసాలను ప్రజలు గ్రహించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనల కూటమి సమిష్టి కృషితో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మరో రెండు నెలల్లో ప్రజాకోర్టులో జగన్ రెడ్డికి ఘోర పరాభవం తప్పదన్నారు. ఇసుక మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా దోచుకో.. దాచుకో అన్నరీతిలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జాబ్ క్యాలెండర్, ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేదం, విద్యుత్ చార్జీల పెంపు, హామీలు నెరవేర్చలేకపోయారనీ, ప్రజలు మాత్రం టీడీపీకి వచ్చే ఎన్నికల్లో పట్టం కట్టడం ఖాయమన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక జడ్జీ

మంత్రాలయం, ఫిబ్రవరి 13 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ రాజేంద్ర మంగళవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి మంత్రాలయంలో బస చేసిన విషయం తెలిసిందే. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి లు ఘనంగా స్వాగతం పలికారు. వీరి వెంట తాహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

సూదేపల్లె జడ్పీహైస్కూల్‌లో ఈఎండీపీ ఎక్స్‌పో

వెల్దుర్తి, ఫిబ్రవరి 13 : మండలంలో సూదేపల్లె గ్రామములో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీ, ఆంగ్ల ఉపాధ్యాయురాలు నాగమణి ఆధ్వర్యంలో ఈఎండీపీ ఎక్స్‌పో ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఈఎండీపీ కోఆర్డినేటర్ గోపాల్ హాజరై ప్రసంగించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులలో వ్యవస్థాపరమైనటువంటి ఆలోచనలను రేకెత్తించే విధంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామపెద్దలు వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హెప్సిబా, మురళీమోహన్, చిన్ననాగస్వామి నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి



సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డు అందుకుంటున్న విద్యార్థులు మనోజ్, రంజిత్

మద్దికెర, జనవరి 13: మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చదువుకుంటున్న పూజారి మనోజ్, జి.రంజిత్ రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ప్రధానోపాధ్యాయులు విజయరామరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అరవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిల్లాలో మొదటి స్థానంలో రాణించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో కర్నూలులో జరిగిన సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు.

కార్మికులను మోసం చేస్తే సహించేదిలేదు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 13: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను సీఎం జగన్ మోసం చేస్తే సహించేదిలేదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు యల్లప్ప, ఏఐటీయూసీ నాయకులు విజయేంద్రలు హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

వేలాల్లో మితిమీరిన జోక్యం

● అధికార పార్టీ నేత హల్‌చల్
● అయినవారికే దక్కిన మార్కెట్ యార్డులు
● ఆశించిన స్థాయిలో పెరగని ఆదాయం



పాటదారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 13: ఎమ్మిగనూరు పురపాలక సంఘానికి ప్రధాన ఆదాయ వనరులైన మున్సిపల్ మార్కెట్ల వేలాల్లో అధికార పార్టీ నాయకుల జోక్యం మితిమీరిపోతోంది. దీంతో పురపాలక సంఘానికి రూ.లక్షల్లో రావాల్సిన ఆదాయం కాస్త రూ. వేలకు పడిపోయింది. ఈ ప్రభావం పట్టణాభివృద్ధిపై పడుతోందని పట్టణ వాసులు బహిరంగంగానే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ల వేలాలను నిర్వహించారు. వారపు సంత మార్కెట్ వేలం పాడేందుకు పాటదారులు రాక వేలం పాట వాయిదా పడింది. డైలీ మార్కెట్ వేలం పాటను రూ.27.54 లక్షలుగా అధికారులు నిర్ణయించగా దస్తగిరి, మునీర్ వేలం పాటలో పాల్గొన్నారు. వీరిలో మునీర్ రూ.27.57లక్షలకు దక్కించుకున్నారు. అలాగే వారపు పశువుల మార్కెట్‌ను రూ.15.59 లక్షలకు నిర్ణయించగా దస్తగిరి, రాము, రామకృష్ణ పాటలో పాల్గొనగా రామకృష్ణ రూ.15.62 లక్షలకు దక్కించుకున్నారు. గొర్రెల మార్కెట్‌ను రూ.15.52లక్షలుగా నిర్ణయించగా రామకృష్ణ, రాము పోటీ పడ్డారు. రాము రూ.15.66 లక్షలకు దక్కించుకున్నారు. ఇక గొర్రెల కబేళాను రూ.లక్షా 27వేలకు నిర్ణయించగా హనీఫ్ అనే పాటదారుడు రూ.లక్షా 29వేలకు దక్కించుకోగా, మాంసపు మార్కెట్‌ను రూ.లక్షా 30వేలకు నిర్ణయించగా రహిమాన్ అనే పాటాదారుడు రూ.లక్షా 35వేలకు దక్కించుకున్నారు. వేలం పాటల్లో అధికార పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ పాల్గొని పాటాదారులకు సూచనలు చేయడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే ముందుగా నిర్ణయించుకున్న ప్రకారమే పాటాదారులు కుమ్మక్కై అధికారులు నిర్ణయించిన పాటా ధరకన్నా కేవలం నాలుగైదువేలు మాత్రమే పెంచి మార్కెట్ వేలాలను దక్కించుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది పురపాలక సంఘానికి కేవలం రూ.18వేల ఆదాయం మాత్రమే పెరిగింది. ఏదో పోటీ ఉంది.. అంటే ఉంది.. అన్నట్లుగా వేలం పాటలు సాగడంతో మున్సిపల్ ఆదాయానికి భారీగానే గండి పడిందని స్థానికులు అధికార నేత జోక్యంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, మేనేజర్ వరప్రసాద్, ఆర్వో జేబి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడతాం

● మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి
● ఎరిగేరి వైసీపీ యువత టీడీపీలో చేరిక



కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తిక్కారెడ్డి

కౌతాళం, ఫిబ్రవరి 13: ఇళ్ల పట్టాలు పొందిన అర్హులైన పేదలకు న్యాయం జరిగే వరకూ తెలుగుదేశం పార్టీ వెన్నంటే పోరాడుతుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో మంగళవారం మండల టీడీపీ నాయకులు, గ్రామ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 253లో ప్రభుత్వ భూమి దాదాపు 10 ఎకరాలు ఉండగా ఈ స్థలంలో 2006లో గ్రామస్తులకు పట్టాలు ఇచ్చి హద్దులు చూపలేదన్నారు. లబ్ధిదారులు ఈ స్థలంలో ఇళ్లు నిర్మించుకోకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అనుచరులు ఆ స్థలాలను కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్మే యత్నం చేశారన్నారు. పరిస్థితిని గమనించిన లబ్ధిదారులు ఇది ప్రభుత్వ స్థలమని, ఇందులో తమకు పట్టాలు ఉన్నాయని న్యాయస్థానాన్ని ఆశ్రయించారని పేర్కొన్నారు. లబ్ధిదారుల చర్యతో ఖంగుతిన్న ఎమ్మెల్యే అనుచరులు అక్కడి నుంచి జారుకున్నారన్నారు. అర్హులైన పేదలకు ఈ స్థలాలు ఇళ్లు నిర్మించాలని కోరారు. పేదలకు న్యాయం జరిగే వరకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, నాయకులు కోట్రేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్, రమేష్‌గౌడ్, వెంకటరెడ్డి, సిద్ధు, మంజునాథ, రాజానందు, దిద్ది ఉసేని తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ఎరిగేరి గ్రామానికి చెందిన 10 మంది వైసీపీ పార్టీ యువత మంగళవారం తిక్కారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ వల్ల రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని, ఏపీ బాగుపడాలంటే బాబుతోనే సాధ్యమని టీడీపీలో చేరామని పార్టీలో చేరిన పూజారి తాయప్ప, జాలవాడి నరసింహ, విజయ్, శేఖర్ పేర్కొన్నారు.

మూడు నెలల్లో ఇంటింటికీ కొళాయి : కేఈ శ్యాంబాబు



వైజీ తండాలో ప్రచారం నిర్వహిస్తున్న కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని, మూడు నెలల్లో ఇంటింటికీ మంచినీటి కొళాయి వేయిస్తామని పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని వైజీ తండా, రోళ్లపాడు తండా, ఉప్పర్లపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక బోర్లు వేయించడంతో పాటు సుజల స్రవంతి పథకం కింద సురక్షిత నీరు కూడా అందించామని గుర్తుచేశారు. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన మెగా వాటర్ ప్లాంటును మూసివేసిన ఘనత వైసీపీదే అన్నారు. ప్రజలకు గుక్కెడు నీరు కూడా అందించలేని దయనీయ స్థితిలో పాలన సాగుతోందని విమర్శించారు. వైసీపీకి బుద్ధి చెప్పాలంటే.. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గిరిజనుల సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు అప్పా వేణుగోపాల్, నాయకులు ఫక్కీరప్ప, తులసినాయక్, గోవింద నాయక్, రాజు నాయక్, నాయుడు నాయక్, రామూ నాయక్, మనోహర్, ఈశ్వరయ్య, ఆనంద్ కుమార్, మాన్‌సింగ్, శ్రీను నాయక్, శ్రీనివాసులు గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో కాంగ్రెస్ అభ్యర్థుల పోటాపోటీ



కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న దిలీప్ ధోకా (ఫైల్)

ఆదోని టౌన్, ఫిబ్రవరి 13: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయడానికి అభ్యర్థులు పోటాపోటీగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులు పోటీ చేయడానికి అవకాశం కల్పించాల్సిందిగా కోరుకుంటూ దరఖాస్తు చేసుకున్నారు. వైఎస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పదవీబాధ్యతలు చేపట్టడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మద్దతుదారులలో కొత్త జోష్ కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి తిరిగి పూర్వవైభవం వస్తుందన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. 1955 నుంచి ఆదోని అసెంబ్లీకు 14 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీకు చెందిన వై సాయిప్రసాద్ రెడ్డి వైసీపీలో చేరి 2014-2019 ఎన్నికలలో గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన బోయ నీలకంఠప్ప తిరిగి పోటీ చేయడానికి అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకొన్నారు. కాంగ్రెస్ పార్టీకు ముందు నుంచి మైనార్టీలలో అధిక శాతం మద్దతుదారులుగా ఉంటున్నారు. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహ్మద్ మైనారిటీ కోటా కింద పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డితో సన్నిహితంగా వెలిగిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఇంద్రచంద్ ధోకా మనవడు, సీనియర్ నాయకుడు దిలీప్ ధోకా కూడా ఈసారి ఎన్నికలలో తనకు పోటీ చేయడానికి అవకాశం కల్పించాల్సిందిగా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలో పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకని కాంగ్రెస్ పార్టీకి ఈసారి పోటీ చేయడానికి కాంగ్రెస్ వాదులు పోటా పోటీగా ముందుకు రావడం విశేషం.

వైభవంగా సుజయీంద్ర తీర్థుల ఆరాధన ఉత్సవాలు



బంగారు రథంపై ఊరేగుతున్న సుజయీంద్రతీర్థులు

మంత్రాలయం, ఫిబ్రవరి 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామి పూర్వ పీఠాధిపతులు సుజయీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య సుజయీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. అనంతరం బంగారు రథంపై సుజయీంద్రతీర్థుల చిత్రపటాన్ని అధిష్టించి మేళతాళాలతో ఆలయ ప్రాంగణం చుట్టూ ఘనంగా ఊరేగించారు. జయహో సుజయీంద్రతీర్థ జయహో అంటూ భక్తులు జయధ్వానాలు పలుకుతూ ఊరేగించారు. కార్యక్రమంలో పండిత కేసరి రాజాఎస్ గిరిరాజాచార్, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి : డ్వామా పీడీ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 13 : ఉద్యానవన పంటలకు మొక్క నుంచి సంరక్షణ (మూడు సంవత్సరాలు) వరకు ప్రభుత్వం అందిస్తున్న వందశాతం సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామళ్లకోట గ్రామములో రైతులు సాగుచేస్తున్న మామిడి, దానిమ్మ ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అన్ని రకాల ఉద్యానవన పంటలకు (సపోట, దానిమ్మ)ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. అలాగే వేతనదారులతో గుంతలు తీసి మొక్కలు నాటడం, ఎరువులు, ఇంటర్ క్రాపింగ్ తదితర వాటికి మూడు సంవత్సరాల సంరక్షణ కోసం రైతుకు ఒక్కో ఎకరాకు సుమారు రూ.1.50 నుంచి 2 లక్షల వరకు ఉద్యాన పంటను బట్టి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. బోయినపల్లి, వెల్దుర్తి గ్రామాలలో చేపడుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎపిఓ రాజునాయక్, టిఎ నాగేశ్వర్‌రెడ్డి, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలి

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 13: దరఖాస్తు చేసుకున్న వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఫోరం ఫర్ ఆర్ టీ ఐ జిల్లా కార్యదర్శి బోగ్గుల తిక్కన్న, కాంగ్రెస్ మండల కార్యదర్శి ఆనంద్ రాజులు తహసీల్దార్ సురేష్ బాబును కోరారు. మంగళవారం మండల కేంద్రం పెద్దకడబూరులోని తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ సురేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పనులు అవసర నిమిత్తం వచ్చె ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో అప్రమత్తంగా ఎలాంటి రాజకీయ ఒతిళ్లకు లోంగకుండా నిష్పాక్షపాతంగా ప్రజలకు సేవలందించాలన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మద్దికెర, జనవరి 13: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికి అందించే మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతా ప్రమాణాలతో అందించాలని ఎంపీడీవో అలివేలమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఏవో స్వర్ణలత, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, వీఆర్వో మల్లికార్జున తదితరులు ఉన్నారు.

అకౌంటుకు ఆధార్-ఈకేవైసీ తప్పనిసరి

తుగ్గలి, ఫిబ్రవరి 13: సహకార సంఘంలో ఖాతా ఉన్న ప్రతి ఖాతాదారుడు వారి అకౌంటుకు ఆధార్‌తో ఈకేవైసీ అనుసందానం చేయించుకోవాలని మారెళ్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ సహకార సంఘంలో ఆయన మాట్లాడుతూ సొసైటీ కార్యాలయంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు వారి అకౌంటులో నగదు రూ.300 ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 13: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల, సాయి కళాశాలతో పాటు మరి కొన్ని కళాశాలలో జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ చేయడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, విష్ణు, రామనాయుడు, ఉమేష్, శివరాజు, వీరేష్ పాల్గొన్నారు.

ఉద్యోగాల వల వేస్తున్న జగన్

● ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్



మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఫిబ్రవరి 13: ఎన్నికల జిమ్మికులలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నిరుద్యోగులకు వల వేసేందుకు నామ మాత్రంగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో ఎన్నికల ముందు టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి మినీ డీఎస్సీ నిర్వహించడం వల్ల పూర్తి స్థాయిలో పోస్టులు భర్తీ అయ్యే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి దగా చేశారని, రానున్న ఎన్నికలలో జగన్‌కు బుద్ధి చెప్పేందుకు వారు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

గడ్డివాము దగ్ధం

హొళగుంద, ఫిబ్రవరి 13: మండలంలోని పెద్దగోనేహాల్ గ్రామంలో బోయ నెంగి శంకరన్న అనే రైతుకు చెందిన పది ట్రాక్టర్ల గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు సర్పంచు కొత్తింటి వెంకట్ రెడ్డి మంగళవారం తెలిపారు. సాయంత్రం 7 గంటల సమయంలో గడ్డివాముల నుంచి దట్టమైన మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. సుమారు రూ.6 లక్షలు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రమాదంలో నష్టపోయిన రైతును ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 13: మంత్రాలయం నియోజకవర్గంలో 2023 ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు మండలాలుగా ప్రకటించి ఇప్పటికి ఒక్క పైసా కూడా జగన్ ప్రభుత్వం రైతులకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా నాయకులు జయరాజు, రైతు సంఘం నాయకులు ప్రాణేష్ పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని టీడీపీ నేతల బైఠాయింపు



రోడ్డు వేయాలని కంకర తేలిన రోడ్డుపై బైఠాయించిన టీడీపీ నేతలు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 13: పట్టణంలోని గీతామందిర్ వెనుక రోడ్డు వేయాలని కోరుతూ మంగళవారం టీడీపీ 21వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఉసేన్ పీరా ఆధ్వర్యంలో కౌన్సిలర్ దయాసాగర్, కమిటీ సభ్యులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దయాసాగర్ మాట్లాడుతూ గీతామందిర్ ప్రాంతంలో రోడ్లుకు సంబంధించి సెక్షన్ పనులు చేసి వదిలేశారని, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లప్ప, గడ్డం రవి, జైరామ్ రంగమ్మ, సత్యమ్మ, ఉమాదేవి, రేష్మలు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్, ఫిబ్రవరి 13 : నాగనాథనహళ్లి గ్రామ శివారులో భారీగా కర్ణాటక మద్యాన్ని ఇస్పీ పోలీసులు కాపు కాసి పట్టుకున్నారు. మంగళవారం హొళగుంద మండలం నెరణికి చెందిన మైలారప్ప, చలువప్ప, ఆదోనికి చెందిన బోయ సూర్య రెండు ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక నుంచి మద్యం తరలిస్తుండగా, రూరల్ సీఐ నీరంజన్ రెడ్డి, ఇస్పీ ఎస్.ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. 18 బాక్సుల కర్ణాటక మద్యం, 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కార్యకర్త మృతి పార్టీకి తీరని లోటు

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 13: టీడీపీ కార్యకర్త గాదిలింగప్ప మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగులపాడు గ్రామానికి చెందిన గాదిలింగప్ప కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన కార్యకర్త మృతదేహనికి నివాళి అర్పించి మట్టి ఖర్చులకు రూ 5వేల అందజేశారు.

ఘనంగా మరిస్వాముల తాత తులాభారం

కౌతాళం, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని కృష్ణావధూత ఆశ్రమంలో మంగళవారం ఆర్లబండ మఠం మఠాధిపతి మరిస్వాముల తాత తులాభారాన్ని భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వాముల వారికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ నాయకుడు చెన్నబసప్ప వరుసగా 16వ సారి స్వాముల వారికి సొంతంగా తులాభార కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి హాజరయ్యారు.